దేవుడా రక్షించు!

పి.వి.బి. శ్రీరామమూర్తి

కుండపోతగా కురుస్తున్న వర్షంలో గూడు చెదిరి దిక్కులేక గిలగిలా కొట్టుకుంటున్న పిల్లల పక్షిలా 'మూడ్రోజులుగా జ్వరతీవ్రతచే కుక్కి మంచంలో పడుకుని కన్ను తెరవని, భార్య దగ్గర అయోమయంగా కూర్చున్నాడు భద్రయ్య. భద్రయ్య చుట్టూ చేతికి అందుకురాని పిల్లలూ, మనవలూ తిండీ తిప్పలూ సరిగాలేక, కేశసంస్కారం అసలే తెలియక కొబ్బరిపీచుల్లాటి జుట్టుతో అస్థిపంజరాల్ని కూచోబెట్టినట్లు కూర్చున్నారు. భద్రయ్యకి ఇంటినిండా బోలెడంతమంది జనం ఉన్నా, భార్య కేదేనావస్తే చెయ్యటానికి ఆడదక్షత మాత్రంలేదు. అందుకే భద్రయ్య అనుకుంటాడు అప్పుడప్పుడు. 'తనదీ, తన భార్యదీ ఒకే జాతకమనీ, తామసలు కష్టాలనుభవించటానికే పుట్టామ'ని. ఆ వేదాంతంతోనే భద్రయ్య తన ఏభయ్యేళ్ళ జీవితాన్ని తిరగేసాడు.

మంచి వయసులో ఉన్నపుడు, అంటే యౌవనం ఉరకలు వేస్తున్న

పాతికేళ్ళ ప్రాయంలో ఎవరేనా 'నీ పేరేమిటి?' అని అడిగినప్పుడు 'వీర భద్రరావ్' అని గొప్పగా చెప్పుకొనేవాడు. తాని-తండ్రి పోయి, కుటుంబ భారం తన భుజస్కంధాలమీద పడినప్పుడు, జీవితంలో తాను సుఖపడాల్సిన రోజులు చాల దూరంలో ఉన్నాయని అంచనా వేసుకునే సమయంలో బాధ్యతల బరువులకు లొంగిపోయిన భద్రయ్యని 'నీ పేరేమిటి' అని అడిగినప్పుడు 'వీర భద్రం, అని చెప్పుకునేవాడు. తరువాత్తరువాత భద్రయ్యకో ఆడదాని అవసరం కలిగి, పెళ్ళిఖర్చు భరించుకో లేక, తనకి బాగా తెల్సిన రంగమ్మని తెచ్చుకొని కాపురం చేస్తూ ఆరుగురు పిల్లల తండ్రయి, ఆ పిల్లల నోటికి సరిగా తిండిపెట్టలేక, అప్పులు చేస్తూ, అవి తీర్చుకోలేక 'ఛీ,ఛీ' అని అనిపించుకుంటున్నపుడు 'నీ పేరేమిటయ్యా?' అని అడిగితే ఒత్తుకూడా తీసేసి, మనిషి అష్టవంకర్లు తిరిగిపోతూ, 'బద్రయ్య' అని సమాధానం చెప్పటం నేర్చుకున్నాడు. ఆ తరువాత పెద్ద కూతురి సంసారం బుగ్గయిపోయి, గంపెడు పిల్లలతో యిల్లు చేరినప్పుడు, ఆ తరువాత మరికొద్దిరోజులకే లోకం విడిచి అది వెళ్ళిపోయినప్పుడు, తిండి లేక, ఆకలిబాధకి తట్టుకోలేక తన రెండో కొడుకు బ్రతుకుతెరువుకోసం సులభమైన మార్గం కనిపెట్టి కొన్నాళ్ళు జేబులు కత్తిరించి, ఆ తరువాత పట్టుబడి చావుదెబ్బలు తిని తన కళ్లముందు చేతికి బేడీలతో జైలుకి వెళ్ళినప్పుడు, తనకి తెలియకుండా కూతురు పిల్లలు ఆకల్తో ముష్టి అడుక్కుంటున్నపుడు, ఎవరైనా తెలిసినవాళ్ళు భద్రయ్యని 'నువ్వెవరు? నీ పేరేమిటి?' అనే వివరాలడిగితే దైన్యంగా, మూటగట్టిన బాధల్ని పిండుతున్నట్లు నీరసంగా 'దిక్కుమాలోడు' అని చెప్పడానికి పూర్తిగా అలవాటుపడిపోయాడు.

భద్రయ్యకి తన జీవితాన ఏదో రోజున వెన్నెల అకస్మాత్తుగా వచ్చేస్తుందని, తానప్పుడు ఆనందాల పల్లకిలో హాయిగా విహరిస్తాననీ, పూర్వంలా పిచ్చిగా ఆశించటం ఏనాడో మానుకున్నాడు. ఈ ఏభయ్యేళ్ల జీవితంలో భద్రయ్య ఒకటే నేర్చుకున్నాడు. ఆ పూటకి ఉంటే కడుపునిండా (కాకపోయినా) తినేయటం ... అనవసరంగా దేనికీ బాధపడిపోకుండా, అన్నిటికీ ఆ భగవంతునిపైనే భారంవేసి కంటినిండా కునుకుతియ్యటం !

అందుకే-భద్రయ్యకిప్పుడు పడుకోగానే నిద్రవచ్చేయటం మొదలుపెట్టింది. రానురాను ఈ నిద్ర ఎక్కువయిపోవటం వలన పట్టపగలు కూడా ఎక్కడేనా కూర్చుంటే కళ్ళమీదికి నిద్రాదేవత వచ్చి వ్రాలటం మొదలుపెట్టింది. అందుచేతనే భద్రయ్య వనజమ్మగారిచేత

చీవాట్లు కాయటం ... ఉద్యోగంనుంచి తొలగించేస్తానని ఆమె కేక లేయటం... భద్రయ్య బ్రతిమలాడుకోవటం పరిపాటి అయిపోయింది. కుక్కి మంచంలో పడుకున్న భార్యదగ్గర కునికిపాట్లు పడుతున్న భద్రయ్యకి. 'ఆరో గంటయే సరికి వచ్చి పట్లుదులపాలి', అని మరీ మరీ చెప్పిన వనజమ్మ కలలో కనిపించి నట్లు జ్ఞాపకంవచ్చి త్రుళ్ళిపడిలేచాడు. అప్పటికే ఎనిమిదోగంట సైరన్ 'బంయ్' మని ఊదేసి పావుగంట దాటిపోయింది. ఈపాటికి వనజమ్మగారు కారాలు, మిరియాలు నూరుతుంటారు. 'ఇయ్యాల ఆయమ్మకి ఏమని సంజాయిసీ సెప్పు కోవాల? తన కట్టాల్ని ఆయమ్మకి ఎలా సెప్పుకోవాల? సెప్పుకుంటే మాత్రం ఆ యమ్మకి అర్థమయితేకదా?' అసి గాభరా పడిపోతూ అక్కడినుంచి లేచి పోయాడు భద్రయ్య.

నిజమే!

వనజమ్మకి భద్రయ్య కష్టాలెలా తెలుస్తాయ్ ?

నెలలో ఏ కొద్దిరోజులు మాత్రమో తిండితింటూ, మిగతారోజులు కాళ్ళు ముడుచుకుని మంచినీళ్లతోనో, బెల్లపు నీటితోనో కడుపు నింపుకుని పడుకుని వంటినిండా రోగాలతో కుళ్ళిపోతూ, రోగంవస్తే మందులేక కుక్కిమంచం మీద పడేదుస్తూ, తన కడుపు మాడిపో తున్నా చంటిదాని కిన్ని మెతుకులైనా లేవే అని కుమిలిపోతున్న రంగమ్మ లాటివాళ్లూ జబ్బుతో పడుకున్న పెళ్లానికి మందిప్పించలేక, ఆకలితో ఉన్న పిల్లలకి తిండి పెట్టలేక, తను తిన్నాడో లేదో, తనకి ఆకలేస్తుందో లేదోనని కూడా మరిచిపోయి, 'యజమానురాలికి ఎలా సంజాయిషీ చెప్పటమా' అని ఆలోచించే భద్రయ్యలాటి వాళ్ళున్నా రని, వనజమ్మకి మాత్రం ఎలా తెలుస్తుంది ?

వనజమ్మ చిన్నప్పటినుంచి ఎంత గారాభంగా పెరిగిందని ? వనజ చిన్న తనంలో...చాలా చిన్నప్పుడు...అంటే ఆరేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడు తనడిగిన వస్తువు వెంటనే తెచ్చిఇవ్వ లేదన్న కోపంతో తన చేతిలోఉన్న చెంచా ఆయమ్మపై విసిరికొట్టినప్పుడు, దాని తలనుండి రక్తం ధారగా కారినప్పుడు చుట్టూరావున్నవాళ్ళు, తండ్రీ, తల్లీ కూడా వనజమ్మకి 'ఆయా' కోపం తెచ్చినందుకే ఎంతో బాధపడ్డారుకాని... 'ఆయా' తల కన్నంపడి రక్తం కారినందుకు ఎవరూ వనజమ్మని కన్నెర్ర చేసి కూడా చూడలేదే ?

అలాగే మరోసారి-

'వనజ' ఇంగ్లీషు కాన్వెంట్‌లో చదువుకుంటున్నపుడు సాయంకాలం వనజని ఇంటికి తీసుకురావటానికి కొద్ది నిమిషాలు ముందుగా వెళ్ళనందుకు వనజకు చాలా కోపం వచ్చేసింది కారు

డ్రైవరుమీద కోపంతో ఇంటికొచ్చేసి కారు దిగి యింట్లో పుస్తకాలు విసిరికొట్టి "డాడీ! ముందు ఈ డ్రైవర్ని ఉద్యోగం లోంచి తీసేస్తావా ? నన్నే చదువు మానేయమంటావా" అని చాలా సీరియస్‌గా కూతురు అడుగుతున్నపుడు డ్రైవరుకు వెళ్ళవలసిన డబ్బు లెక్కగట్టి ఉద్యోగంనుండి తొలగించేసాడే కాని 'ఏం తప్పు చేసాడ'ని కూతుర్ని ప్రశ్నించలేదు వనజ తండ్రి.

అందునుంచి—

'ఆమెకు సేవకుల కష్టాలెలా తెలుస్తాయి?'

అంతేకాదు—

'వనజ ఎనిమిదో తరగతి చదువుతునప్పుడు పధ్నాలుగు రోజులు టైఫాయిడ్ జ్వరంతో మంచం ఎక్కినపుడు, గంట గంటకు ఆమె పరిస్థితెలా ఉందని తెలుసుకోవటానికి పెద్దపెద్ద డాక్టర్లు వస్తూనే ఉండేవారు. ప్రతి సాయంకాలం 'వనజ' కెలా ఉందో తెలుసుకుందామని వాళ్ళ స్కూలు టీచర్లు, పిల్లలూ వచ్చి చూసిపోతూనే ఉండేవారు. వచ్చేటప్పుడు పళ్ళు, బిస్కట్లూ కుప్పలుగా తెచ్చి పోస్తుండేవారు. జ్వరంనుంచి కోలుకున్నాక 'వనజ' తనకి ఎంత విలువ ఉన్నదీ నిజంగా తెలుసుకుంది! జ్వరం పడి లేచిన తరువాత నిజానికి వనజ ఆ ఇంటికి మోనార్క్ అయింది. అప్పట్నించే 'ఎవరు ఏ పని ఆ ఇంట్లో చెయ్యదలచుకున్నా వనజమ్మకి చెప్పి మాత్రమే చెయ్యాలి!' అనే రూలు పాసయింది ఆ ఇంట్లో.

యవ్వన వసంతంలో అడుగిడుతున్న సమయంలో ఆమె కాలేజీలో చేరింది. ఆ సమయంలో సంపదలు ఆమెకి మరింత సౌకర్యాన్ని ప్రసాదించి ఆమెను పూవుకంటె కోమలంగానూ మెరుపు తీగ కంటె అందంగానూ చేసాయి. "కాలేజ్ బ్యూటీ" అయి చాలమందిని పిచ్చి వాళ్లని చేసేసింది. కాని- 'వనజ' వాళ్ల పిచ్చిలో పడిపోయి పిచ్చిదిమాత్రం కాలేదు.

కారణం-

తనకోసం నానా అవస్థలూ పడిపోతున్నవాళ్ళూ, తనతో తన కాలేజీలో చదువుకుంటున్నవాళ్ళూ ఎవరూ తనకి సరిపోయినవారూ ... తన ఎన్నికకు తగినవారుగానూ కనిపించలేదు వనజకి.

అందునుంచి వాళ్ళవేపు కనీసం ఓ చూపైనా విసరడానికి ఆమె మనసు ఇచ్చగించేది కాదు. ముందుకొచ్చి సూటిగా తమ అభిప్రాయం చెప్పటానికి కూడా వాళ్ళకి ధైర్యం చాలేదికాదు!

వనజకు ఒక్క అందం మాత్రమే కాదు...అధికారం ఉంది. అధికారమే కాదు...అహంకారం ఉంది. ఆత్మాభిమానం ఉంది. తెలివితేట లున్నాయి. ఒక విషయాన్ని నలుగురి ముందూ

సభలో కూడా ధైర్యంగా చెప్పగలిగే సామర్థ్యం కూడా ఉంది.

ఓసారి వనజ-

ఇంటర్ కాలేజస్ ఇలక్యూషన్ కాంపిటీషన్‌లో "గరీబీహటావో" అన్న విషయంమీద చాల గమ్మత్తుగా ... అందంగా మాట్లాడింది అప్పుడే..."మానవులంతా ఒక్కటే ... అందరు పీలుస్తున్నదీ ఒక్కటే గాలి ... మానవులంతా త్రాగుతున్నది అదే నీరు...అందరిలోను అదేరక్తం ప్రవహిస్తోంది. అందరికీ కన్నూ ... ముక్కూ ... కాళ్ళూ ... చేతులూ అన్నీ సమంగానే ఇచ్చాడా భగవంతుడు.

అయితే మరి సమాజంలో ఈ ధనిక-పేద అనే వర్గాలు ఎందుకేర్పడ్డాయన్నది ఇప్పటి ప్రశ్న!

మనుషుల్లో తెలివైనవాళ్లూ...తెలివి తక్కువవాళ్లూ ఉన్నారు ... తెలివైన వాళ్ళు తమ తెలివితేటల్ని ఉపయోగించుకుని ఇంకా గొప్పవాళ్లవుతున్నారు. తెలివి తక్కువ వాళ్ళు...కష్టపడలేక...ఎలా డబ్బు సంపాదించుకోవాలో తెలియక ... చేతకాక...గొప్పవాళ్ళని చూచి...అసూయతో... ద్వేషంతో... వాళ్ల ఆస్తులు అపహరించాలనీ...వాళ్ల జేబులు కొట్టాలని...వాళ్ళ బీరువాలు కన్నం వేయాలని కుత్సితంగా ఆలోచిస్తున్నారు. అందుకే పీళ్లు మరింతగా దిగజారిపోతున్నారు. మన సమాజంలో ఒక సామెత ఉంది. "ఒక కన్నుపోయినందుకు ఏడవకు... రెండవకన్ను బాగున్నందుకు సంతోషించు" అని. అందునుంచి పేదవాళ్ళు ధనికవర్గాన్నిచూసి కళ్ళు పొడుచుకోవటంకంటె తమకన్నా తక్కువస్థితిలో ఉన్న వాళ్ళని చూసి తామంతకంటె బాగున్నందుకు తృప్తిపడటం నేర్చుకోవాలి. మనస్సంతృప్తి లేకపోతే మనిషి బ్రతకటం కష్టం." అని ఇలా వనజ ఏకధాటిగా చెప్పినప్పుడు సభలోనించి విన్పించిన చప్పట్లు పావు గంటవరకూ ఆగలేదు. అది విని సభలోన గౌరవంగా మిలట్రీ ఆఫీసరు వనజ తండ్రి తన్మయత్వం చెందిపోయాడు. జడ్జస్ 'వనజ'కే ఫస్ట్ ప్రయిజ్‌ని డిక్లేర్ చేసేసారు.

ఆ తరువాత డిగ్రీ పూర్తయ్యాక 'వనజ'కి అప్పుడే ఐ.ఏ.ఎస్. పూర్తిచేసి కొత్తగా సబ్-కలెక్టరుగా వచ్చిన కోటేశ్వరరావు ఏకైక పుత్రుడు అందాలరాసి అయిన రాఘవరావుతో మహావైభవంగా పెళ్ళి జరిగిపోయింది.

అందుచేత-

అప్పట్నించే కాకుండా, అంతకు ముందునుంచి కూడా ఆమెకు అధికారం చెలాయించటమే తెలుసుకాని, ఆదరంతో సేవకజనాన్ని అర్థంచేసుకోవటం మాత్రం తెలియదు!

ఎలా తెలుస్తుంది మరి ?

భద్రయ్య తన బాధల్ని చెప్పుకుంటే

మాత్రం ఆమె ఎలా అర్థం చేసుకో గలదు?

అర్థంకాని భద్రయ్య, అయోమయంగా, అల్లకల్లోలంగా, ఆదరబాదరగా ఆయాసపడిపోతూ చెమటలు కక్కుకుంటూ వచ్చేసరికి పార్వతీ పరమేశ్వరుల్లా కనిపించిన 'వనజా-రాఘవరావు' లని చూసి "దండాలుబాబూ!" అన్నాడు వణికిపోతూ.

"ఏం భద్రయ్యా! నీ పెళ్ళాం కెలా ఉంది? జ్వరం తగ్గిందా లేదా?" అని రాఘవరావ్ ప్రశ్నించటంతో భద్రయ్యకి ఎక్కడలేని ధైర్యం వచ్చి, తన గోడు చెప్పుకోటానికి కొంత అవకాశం దొరికినట్టయింది.

"లేదు బాబయ్యా! మూడ్రోజుల నుండి తెలివిలే దొంటిమీద. పచ్చి మంచి నీళ్ళు నోట బొయ్యటంలేదు" అని అన్నాడు.

"సర్లే. నాకు తరువాత కనిపించు మందిస్తా" అని అక్కణ్ణించి రాఘవరావు కదలటంతో, అతన్ని అనుసరించింది వనజ. ఆ సమయాన భద్రయ్యలో ఆస్తికత మరికొంచెం పెరిగి భగవంతుణ్ణి చేతులెత్తి మొక్కుతున్నాడు.

* * *

వనజకి 'డాడీ' అంటే అమితమైన అభిమానం. అంతకంటె గౌరవం, భక్తి. ఒక్కరోజు అతని ముఖం చూడలేక పోతే బ్రతకలేనేమో నన్నంత భయం కూడా ఒకప్పుడుండేది. చిన్నప్పట్నించి ప్రక్కమీదనుంచి లేవగానే, కళ్ళు విప్పగానే వనజ తండ్రి 'జయరాం' ముందుగానే "వనజ"నే చూసేవాడు. లేచిన వెంటనే అభిమానంతో కూతుర్ని దగ్గరకు తీసుకునేవాడు. అలా జరగక పొరపాటున ఇంకెవరు కన్పించినా (కనీసం భార్యయినా) ఉగ్రుడైపోయేవాడు. "నా చిట్టితల్లి ముఖం లేవగానే కనిపించలేదు. యివాళ నా కేపని జరగదు. ఈ రోజల్లా ఎలా ఉంటుందో ఏమో" అని నానా గాభరాపడిపోయేవాడు. వనజ తల్లి సుగుణమ్మ కూడా తమ ఏకైక పుత్రిక కళ్లముందు లేకపోతే బెంబేలెత్తిపోయేది. అందునుంచే-వయసు బింకంతో, శుక్లపక్ష చంద్రునిలా విరబూసిన మాధవీలతలా, అందంగా మెరిసిపోయే వనజకి అంతకన్నా అందంగా ఉన్న రాఘవరావుతో పెళ్ళిచెయ్యాలనే ఆనందం ఓ ప్రక్క కలిగినా, 'వనజని అత్తవారింటికి పంపి ఎలా బ్రతగ్గలమా?' అని పెళ్ళి చెయ్యకముందునుంచి చాలా బెంగపడిపోతూ ఉండేవారు. పెళ్ళి రోజున 'జయరాం' దంపతులు ఆనంద సాగరాల్లో తేలియాడినా, మరో ప్రక్క చేతికి అందుకు రావాల్సిన కొడుకు అందకుండా పోయినట్లు, బాధపడిపోయారు. వనజ రాఘవరావుతో తన ఇంటికి వెళ్ళిపోయినప్పుడు, ఆ తరువాతనూ రోజూ పొద్దున్నవేళ కళ్ళు

తెరచేటప్పుడు జయరాం కళ్లు చెమ్మగిల్లేవి. భోజనాలకి కూర్చున్నప్పుడు అలవాటు ప్రకారం మూడో కంచంలో వడ్డించ బోయి తరువాత కూతురు లేని వెలితి తెలుసుకొని చాలా చిన్నబుచ్చుకున్న సుగుణమ్మకి చాలరోజులవరకూ తిండి కూడా సరిగా ఇష్టపడేదికాదు. 'వనజ' అత్తింటికి పోయినప్పుడు కరెంటు దీపాల మధ్య తిరిగినవాళ్ళు ఆముదపు దీపాలమధ్య తిరగవలసి వచ్చినట్లు, ఏర్‌కండిషన్ గదుల్లో మెలగవలసిన వాళ్ళు పూరిగుడిసెల్లో మెలగవలసి వచ్చినట్లు, కుషన్‌బెడ్సుమీద పడుకునే వారికి మట్టినేలమీద పడుకోవలసి వచ్చినప్పటిలాగా, చాలా దీనంగా, కళావిహీనంగా తయారయారు జయరాం దంపతులు. అది భరించలేక, కనీసం నెలకోసారైనా వచ్చి 'వనజ'ను చూసి మూడు రోజులుండి పోతుంటారు.

రాఘవరావుకి ట్రాన్స్ఫరయి కొత్త ప్రదేశంలో ఫామిలీ షిఫ్ట్ చేసాక 'వనజ' తలిదండ్రులు ఇదే తొలిసారిగా రావటం. అందునుంచి ఉదయాన్నే లేచిన దగ్గర్నుంచి వనజ చాల సంతోషంతో మెరిసిపోతోంది. రాఘవరావ్ ఉదయాన్నే లేచి ఎనిమిది గంటలకే బయల్దేరి వెళ్ళి పోతున్నప్పుడు 'వనజ' మరీ మరీ చెప్పింది "ఈ రోజు పన్నెండుకే వచ్చేయండి. 'డాడీ' వస్తున్నారు. మీరొచ్చేదాకా నేను భోజనం చెయ్యను. తెలిసిందా?" రాఘవరావ్ స్వచ్ఛంగా మెరిసిపోయే ఆమెకళ్ళలో కోసారి చూస్తూ మెత్తని ముఖమల్‌లాటి ఆమె బుగ్గలపై సున్నితంగా అధరాల్తో స్పృశించి "శ్రీమతిగారి ఆజ్ఞ! తప్పుతుందా మరి?" అని టాటా చెప్పేసి బయల్దేరిపోయాడు.

"భద్రయ్యా! డాడీ వస్తున్నారీరోజు. నువ్వే ఊరుకెళ్తే ఆ ఊర్లోనే స్థిరపడి పోవటంకాక త్వరత్వరగా పన్లు ముగించుకొని రావాలి. చాలా పన్లున్నయ్. ఇదిగో త్వరగా వచ్చి ఈ వస్తువులు పట్టుకొనిరా!" అని ఏదో చీటిని భద్రయ్య చేతికిచ్చి పర్సులోంచి అయిదు పదులను లెక్కపెట్టి ఇచ్చింది.

* * *

డైనింగ్ టేబిల్‌ముందు కూర్చుని మామగారితో అమెరికా పొలిటిక్సు గురించి, మహమ్మడన్స్ హిస్టరీ గురించి రాఘవరావ్ మాట్లాడుతూ ఉండగా ఎర్రగా కందిపోయిన ముఖంతో, చింత నిప్పుల్లా మండిపోతున్న కళ్ళతో "డర్టీ రాస్కెల్..ఇడియట్...బ్రూట్.. బ్లడీఫూల్" అని ఇంకా వరుసగా తన కొచ్చిన ఇంగ్లీషు తిట్లన్నీ పేరుస్తూ రాఘవరావ్ ప్రక్కన కూర్చున్నది వనజ. జయరాం కూతురు కోపంగా ఉండటంచూసి కలవరపడిపోయారు. రాఘవరావ్ మాత్రం గాభరాపడిపోక ఏ నౌకరో ఏదో తప్పుచేసుంటాడనీ, అందుకే అలా కోపంగా ఉందని

సాధారణంగా ఊహించేసి "ఏమైంది వనూ?" అని ప్రశ్నించాడు అనునయంగా.

"ఏమౌతుంది? అన్నీ మీరు చేస్తున్నవే. మీదెంత స్మూత్‌హార్టయినా నౌకర్లని మరీ అంత నెత్తికెక్కించుకో కూడదు. డాడీ! చెప్పు నెక్కడుంచాలి డాడీ" అంది తండ్రిని ఉద్దేశించి అన్నారు.

"కాలి క్రిందనే ఉంచాలి!" జయరాం.

"నో.. కొన్ని చెప్పులు తలకెక్కించుకునేవి కూడా ఉన్నాయి. గాంధీగారి పాదరక్షల్ని ఇప్పటికీ మ్యూజియంలో ఉంచారు. ఇక—మన పురాణాల్లో ఉదాహరణలు తీసుకోవాలంటే భరతుడు రాముడి పాదరక్షల్నెంత పూజ్యంగా భావించాడనీ?" ఛలోక్తిగా వనజని మరికొంచెం ఏడిపించాలనే ఉద్దేశ్యంతో అన్నాడు రాఘవరావ్.

"ప్లీజ్. డోంట్ కంపేర్ దట్ పూర్ గాంధీ అండ్ దర్టీ అన్‌ట్రూత్‌ఫుల్ ఎపిక్స్. భరతుడు ... వాడొట్టి నేస్టీ ఫెలో. చెప్పులు నెత్తిన పెట్టుకోవడమేమిటి? వాడంటే నాకు అసహ్యం!" మూతి ముడుచుకుని అంది వనజ. ఆ మాటలకి రాఘవరావు, జయరాంలు ఫకాల్న నవ్వారు.

"ఆఁ...సరే ఇంతకీ ఏమయింది? ఎవరిపైన తమ ఆగ్రహం ?"

"ఎవరిపైన అయితేనేం ? ఆ భద్రయ్యని మాన్పించెయ్యమంటే మాన్పించరు. వాడేం చేసాడో చూడండి. ఆ ఫ్లాస్కుని ఎందుకూ పనికిరాకుండా ఎత్తేసి ఎలా తగలెట్టాడో" అన్నది.

"సర్లే వాడి పని నే చూస్తా భద్రయ్యా!" గంభీరంగా పిలిచాడు రాఘవరావ్.

"దండాలండీ" అనుకుంటూ భయంతో వొణికిపోతూ వచ్చాడు భద్రయ్య. "నీకు చాలసార్లు చెప్పాను. వనజమ్మగారికి కోపం కలిగించే పనులు చెయ్యొద్దని. ఈ సారి నువ్వు మళ్ళీ ఆమెకి కోపం కల్గించావో నేనిక రక్షించలేను తెలుసా!" అని అతను అంటున్నప్పుడు భద్రయ్య జయరాంగార్ని కళ్ళప్పగించిచూస్తూ,

"బాబూ... తమరా? ... దండాలు బాబు..." అంటూ అయోమయంగా రెండుచేతులూ జోడించి నమస్కరించాడు. జయరాంగారు కూడా భద్రయ్యని విస్మయంగా చూసి చాలా కంగారుపడిపోయి "బావున్నావా భద్రయ్యా!" మామూలుగా అనేసారు.

"సర్లే వెళ్ళు." తనని వనజమ్మ హెచ్చరించటంతో అక్కణ్ణించి తప్పుకోవాల్సివచ్చింది భద్రయ్యకి. తల దిమ్మెక్కినట్లయింది. చెవుల్లోంచి, శరీరంలోంచి, నరనరాల్లోంచి గాడ్పులు. భద్రయ్య ఏమైపోతున్నాడో అతనికి అర్థం కావటంలేదు. పడిపోతాడేమో

నన్న భయంతో స్తంభానికి చేరబడ్డాడు ఆలోచనలలో భద్రయ్య...

చాలరోజుల క్రితం వారంలో రెండేసి రోజులు పస్తులుకు అలవాటు పడుతున్నపుడు, ఆకలితో ఇద్దరు పిల్లలూ చుట్టూరా చేరి ప్రాణాలు తీస్తున్నపుడు, అడుగడుగున చిరిగిన చీరని వొంటిమీద ఎలా కప్పుకోవాలో తెలియక భార్య సతమతమౌతున్నప్పుడు, మరో చీర కొనాలని తలంపుఉన్నా కొనలేని అశక్తతో కొట్టుమిట్టాడుతున్నపుడు, తన తండ్రిచేసిన అయిదు వందలు వడ్డీతో పన్నెండు వందలు వరకూ పెరిగి కోర్టు ద్వారా పీకమీద కత్తిలా వచ్చిపడినప్పుడు, తనకు జీవితంమీద, సంసారంమీద విరక్తి కలుగుతున్నప్పుడు తనకి పిల్లలు అనవసరం అని అనుకున్నప్పుడు మూడోసారి మరో ఆడపిల్ల పుట్టేసింది భద్రయ్యకి.

ఆ సమయంలోనే-

భద్రయ్య నౌకరిగా పనిచేస్తున్న జయరాంగారి భార్యకి సంతానంలేక, ఎన్నో తీర్థాలు సేవించి, మరెన్నో క్షేత్రాలు దర్శించి, ఇంకెన్నో వ్రతాలు చేసి ఎందరెందరో డాక్టర్లచే పరీక్షలు చేయించుకుని, విసుగెత్తి పరాయిపిల్లల్ని చూసి సంబరపడిపోతున్నప్పుడు "గొడ్డుదానికేం తెలుస్తుంది బిడ్డల సొంరి!" అని తన ఐశ్వర్యాన్ని చూసి సహించలేనివాళ్లు ప్రక్క-ప్రక్క-గా సూటిపోటి మాటలంటున్నప్పుడు, ఆవిడ మనసు బాధతో నలిగిపోయింది. వయసు బింకంలో ఉన్నపుడే ఆవిడకి జీవితం మీద విరక్తి కలిగిపోయింది. రోజంతా ఇల్లు కదలకుండా కృంగి కృశించిపోతున్నప్పుడు భార్యని చూసిన జయరాంగారికి కనీసం ఓ బిడ్డని పెంచుకోవటం ఎంతయినా అవసరమనిపించింది.

అలాంటి సమయంలోనే-

"ఈ బిడ్డ నీ కడుపున పుట్టాల్సినది కాదు. ఏ జమీందార్ల ఇళ్ళలోనో పుట్టాల్సినది. చందమామలా మెరిసిపోయే ఈ పిల్లని ఆ పాడు భగవంతుడు నీ యింట నెలా పడేసాడో కదా!" అని లోకం అంటూంటే భద్రయ్యకీ, రంగమ్మకీ కూడా ఆ మాట నిజమేననిపించింది. సరిగ్గా అదే సమయాన-

రెండ్రోజులుగా ఏదో చెప్పాలని "భద్రయ్యా" అని పిలుస్తూ, మళ్ళీ "ఏం లేదులే" అని తనని తనే సరిపుచ్చుకుంటూ మూడో రోజున మాత్రం "నీతో కొంచెం మాటాడాలోయ్" అన్నారు.

భద్రయ్యకి ఆశ్చర్యం వేసింది. "జయరాంగారి లాటి గొప్పోళ్ళు తనతో మాటాడవల్సిన వేమున్నాయ్?" భద్రయ్య ఆలోచనల్లో పడ్డాడు.

ఆ తరువాత "భద్రయ్యా! మీ అమ్మగారు చాల ప్రమాద పరిస్థితిలో ఉన్నారు. ఆవిడకి ఓ కోరిక ఉంది.

నువ్వు తీర్చగలవ్. కాదంటే ఆవిడ ప్రాణాలు తీసినవాడివి అవుతావు", అని జయరాంగారు అంటున్నప్పుడు అయోమయంగా, నిలువెల్లా వొణికి పోయాడు.

"బాబూ... ఆ యమ్మ పానాలు నా స్త్రీయడమా? ...చెప్పండి బాబూ... నా పానాలైనా యిత్తాను." ఆవేశంతో, స్వామిభక్తితోనూ అన్నాడు.

ఒక్క నిమిషం..రెండు నిమిషాలు అయిదు...పది...పావుగంటసేపు తట పటాయించాక, అక్కడికి అక్కడే చాల సార్లు పచార్లుచేసి "అమ్మగారు నీ మూడో కూతురిమీద మోజుపడుతోంది...... పెంచుకోవాలని!" జయరాంగారి ఆ మాటలు రివ్వున వచ్చి గుచ్చుకున్న బాణాల్లా భద్రయ్య గుండెల్లో గుచ్చుకున్నాయి.

"బాబూ... సెమించండి...మాలాటి దిక్కుమాలినోళ్ళ పిల్లల్ని మీరు పెంచుకుంటారు..."

"లేదు భద్రయ్యా! నీ కూతుర్ని చూసినవగ్గర్నుంచి దాన్ని పెంచుకోవాలన్న కోర్కె మీ అమ్మగారిలో ప్రబల మైంది. నువ్వు కాదంటె ఆమె ఏమవు తుందో భయంగా ఉంది. నువ్వు త్రినే ఇవ్వొద్దు. నీ కెంత కావాలంటే అంత డబ్బిస్తాను," అని అంటున్న జయరాం గారి ముఖం విషాదంతో జేవురించుకు పోయింది. అప్పటికప్పుడు వెంటనే ఏ జవాబు చెప్పాలో తెలియక "మా యాడాదాయితో ఆలోచించి సెబుతా నయ్యగోరూ!" అని అక్కణ్ణించి తప్పు కున్నాడు. ఇంటికొచ్చి భార్యకి విషయం చెప్పిన తరువాత రంగమ్మ చాలసేపు మౌనంగా ఊరుకుండిపోయింది. సగం రాత్రప్పుడు ప్రక్కన పడుకున్న భద్రయ్యనిలేపి ఇదిగో..ఇటుసూడుమీ.. ఇది బంగారంనాటిపిల్ల..దీన్ని చూస్తుంటె ఒగ్గనానికి మనసొప్పకంటా ఉంది. నిజమే! కాని...దీన్ని మనకాడే ఉంచు కుంటే ఇది మన్నాగే గంజినీళ్లకి కూడా నోసుకోక నానాగడ్డీ కరాల. ఇంతకన్నా అమ్మి నెవులికయినా ఇచ్చేసినా మంచిదే! ఆ బావ్‌గారికే ఇచ్చినావా...అమ్మి... రాజబోగాలనుబవిత్తాది. ఎక్కడో ఒక్కాడ ఎవులయినా సుకంగా ఉంటే అదేసాలు. ఆలోసించు. ఎల్లి ఆయమ్మకీ మాట సెప్పు' అని చెప్పింది. చెప్పిందే కాని చాలసేపటివరకూ రంగమ్మ కంటికి కునుకు రాలేదు, కన్నీళ్ళు తప్ప.

ఆ తరువాత తన చేతుల్తో జయరాం గారికి తన మూడో కూతుర్నిచ్చి రెండు వేల రూపాయలు పుచ్చుకుంటున్నపుడు, తండ్రి చేసిన బాకీ వడ్డీతో పన్నెండు వందలు తీరుస్తున్నపుడు ఓ ప్రక్క సంతోషం మరో ప్రక్క దుఃఖం పెల్లుబికివచ్చాయి. గుండెలు ఝల్లుమ న్నాయి. మరికొద్ది రోజులకే జయరాం గారు కేంపు విజయవాడకి మార్చేయ

టంతో తన కూతురు గొప్పగా బ్రతుకు తుండగా చూడడానికి అవకాశం లేకపోయింది. వెళ్ళిపోతున్న జయరాం గారు భద్రయ్యని కలెక్టరు గారింట్లో నౌకరిగా కుదిర్చేసారు. అప్పట్నించి అందరి దగ్గర మంచిగా ఉంటూ కాలక్షేపం చేయసాగాడు భద్రయ్య.

ఆ రోజులు మరోసారి స్మృతిపథంలో తిరుగగా భద్రయ్యకి 'వనజమ్మ' తన కూతురు కాదుకదా? అన్న అనుమానం వచ్చింది. వెంటనే 'వనజమ్మ' తన కూతురు కారాదు ... కాదు. అంత టీవి...ఆ అందం... ఆ సందం... ఆ హోదా..ఎంత గొప్పగా పెరిగితే మాత్రం తన కూతురి కెలా గొస్తాయ్?..కాపోతే అందంగుండొచ్చు..' అని సరిపుచ్చుకున్నాడు. అయితే... "తన కూతురేమై ఉంటుంది?" అన్న అనుమానం మాత్రం మిగిలిపోయింది. ఆ సాయంకాలం సూర్యుడు పడమటి కొండల్లో మునిగిపోయి, చుట్టూ సంధ్య చీకట్లు ముసురుకుంటున్నప్పుడు 'జయరాం'గారి ద్వారా 'వనజ' తన కూతురేనని తెలిసినప్పుడు మొదటగా పట్టరాని ఆనందాన్ని అనుభవించేసాడు. 'దిక్కూ మొక్కూ లేక, తినటానికి పట్టెడన్నానికి కూడా నోచుకోక వాళ్ళు కప్పుకోటానికి సరియైన గుడ్డలేక తన ఇంట్లోఉండి అష్టకష్టాలూ అనుభవించాల్సిన తన కూతురు ఎంత హోదాలో వెలిగిపోతోంది ? ఎంత తెలివి తేటలు వచ్చాయి' అని సంబరపడిపోయి, ఈ విషయం ఎంతవేగంగా భార్యకి చెప్పడమా? అని గాభరా అయిపోయాడు. ఆ మరుక్షణంలోనే అతడి మనస్సు తీవ్రమైన సంక్షోభానికి గురై పోయింది. 'వీల్లేదు. తన కంఠంలో ప్రాణం ఉండగా ఈ దిక్కుమాలిన రూపంతో వనజమ్మకి తండ్రిగా తెలియకూడదు' అనే భావన మనసులోకి రాగానే "దేవుడా! నువ్వే రచ్చించాల. ఈ దిక్కుమాల్నోణ్ని వనజమ్మకి తండ్రిగా తెల్నివ్వకు". అని భగవంతుడికోసారి మొక్కి, అదే మాటని జయరాంగార్తో అని అక్కణ్ణించి లేచి ఇంటికెళ్ళి పోయాడు.

సరిగ్గా అదే సమయానికి అరగంట క్రితం చీకటిగా ఉందని లైటు వేద్దామని వచ్చిన 'వనజ' తన తండ్రీ, భద్రయ్యా ఆడుకొంటున్న మాటలు విని స్థాణువులా నిల్చుండిపోయి, ఇంక ఆట్టేసేపు అక్కడ నిలువలేక వెళ్ళి మంచంమీద బోర్లా పడుకుని వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించింది. పున్నమి చంద్రుడు నల్లగా మాడిపోయి, ఆకాశం దట్టమైన చీకట్లతో భయంకరమైపోయినట్లు, ప్రపంచం అంతా గాలి స్తంభించిపోయి అనేక కోట్ల జీవరాసులు శవాలుగా మారి పోయినట్లు, సముద్రాలన్నీ ఒకేసారిపొంగి పోయి విశ్వమంతా జలమయమైపోయి,

సమస్తప్రాణి సమూహం నిర్జీవమై తేలిపోతున్నట్లుగా వనజకి అనిపించింది ఆ క్షణాన.

మరికొంతసేపటికి పులినోటినుండి సగంప్రాణంతో బయటికి లాగబడిన బక్కచిక్కిన గోవులాగా కనిపించిన భద్రయ్య, తిండిలేక కడుపు వీపుకి అంటుకుపోయి "అమ్మా ఆకలి!" అని పేగులు తెగిపోయినట్టు అరిచే గజ్జిపట్టిన జాగిలాల్లాంటి ముష్టివాళ్ళు, చింపిరి జుట్టుతో చిరిగిన చీర మధ్యనుంచి సగం సగం అవయవాలు కనిపిస్తూ దయ్యంలా భయంకరంగా ఉండే రంగమ్మా తన చుట్టూ చేరినట్లయి, త్రుళ్ళిపడి ప్రక్కకి చూసి "వీళ్ళు నా వాళ్ళు కారాదు... కాదు...కారాదు. నో...నో...వీళ్లేదు..

భగవాన్...ఏమిటిది? ఏమిటీ ఘోరం? భద్రయ్యని ... నేను 'నాన్నా' అని పిలవాలా? ... వీల్లేదు ...భగవాన్... అలా జరగకూడదు..నువ్వేరక్షించాలి!.. నో...నో..." అంటూ గట్టిగా అరిచి ప్రక్కమీదకి ఒరిగిపోయింది మళ్ళీ. అప్పుడే లోనికి వస్తోన్న జయరాంగారు అనుకోని ఘోరం జరిగిపోయిందని, గబగబా పరిగెత్తుకునివెళ్ళి, "అమ్మా... వనజా ... ఏమయిందమ్మా..." అని ఎప్పుడూ కన్నీరు కార్చని వనజ కళ్ళ నుండి జారుతున్న కన్నీటిని చూసి, హృదయం ద్రవించిపోయి, ప్రక్కలయిపోయి బావురుమన్నారు జయరాం గారు.

"డాడీ...చెప్పు డాడీ..ఆ భద్రయ్య నా తండ్రి కాదని చెప్పు డాడీ!" అనుకుంటూ తండ్రిమీద ఒరిగిపోయింది.

"అమ్మా!" అని తప్ప మరోమాట నోటినుండి రాక కూతుర్ని గుండెలకు అద్దుకున్నాడు జయరాం.

"డాడీ...నిజం చెప్పు డాడీ ..ఆ భద్రయ్య ఎవరు? అతడు నాకేమౌతాడు! చెప్పు డాడీ...అబద్ధం చెప్పకు..."అని పదేపదే ప్రశ్నించసాగింది వనజ.

"తల్లీ...చెపుతా..కాని నా కన్యాయం చెయ్యవుగా తల్లీ."

"నువ్వు నా కూతురివి కావని నేనెలా చెప్పగలను?...నిన్ను కనటం మాత్రం భద్రయ్యకి తెలుసమ్మా...నా కోరికను కాదనలేక ... బంగారపు బొమ్మలాటి నిన్ను వాళ్ళింట్లోనే ఉంచుకొని బాగు చెయ్యలేక...నా కోరికను కాదనలేక... నిన్ను నాకిచ్చాడమ్మా భద్రయ్య. అంతే. అక్కణ్ణించి అన్నీ మేమేనమ్మా." కూతురి పరిస్థితి బాగా తెల్సిన జయరాం ఉన్న విషయాన్ని దాచలేకపోయాడు అప్పుడు.

"డాడీ...నాకేం చెప్పొద్దు...నన్నింకా ఆ భగవంతు డెందుకు ప్రాణంతో ఉంచాడో చెప్పు డాడీ..." భోరుమని ఏడవటం మానలేదు

"అమ్మా !" కూతుర్ని ఓదార్చ సాగారు జయరాం.

ఆ తరువాత రెండురోజులు మంచం మీదనుంచి లేవలేకపోయింది వనజ. ఆమె ఆలోచనల్లో...స్మృతిపథంలో... చుట్టూ "భద్రయ్య...తన తండ్రి... కాదు...అవును...కాదు!" అనే ఘర్షణ. మరోసారి "భద్రయ్య..గర్భదరిద్రం.. కూతుర్ని అమ్ముకున్న దుస్థితి...తిండి పెట్టుకోలేని స్థితి..బట్టలు కొనలేని స్థితి.. ఆకలి..." ఇలా ఆలోచిస్తున్న వనజకి మరో ఆలోచన వచ్చింది.

"తను భద్రయ్య దగ్గరుంటే ఎలా గుండేదో" అని. భద్రయ్య ఇంటిలో తన రూపాన్ని ఊహించుకుంది! 'కొబ్బరి పీచులాటి జుట్టు ... లోతుకుపోయిన కళ్ళు ... ఆకలి పేగులు ... చి ని గి

అవయవాల్ని దాచని చీర..మురికిపట్టిన స్టీలు చెంబులా...కళాయిపోయిన అద్దం లాటి ముఖం..ఆశలు చావని చూపులు.. అణచుకోలేని కోర్కెలు ... పరుగులు తీసే యౌవనం..." మరి ఊహించుకోలేకపోయింది. ఆ పరిస్థితిలో భద్రయ్య మంచిపని చేసాడనిపించింది. "ఎస్. భద్రయ్యా నువ్వు మంచిపనిచేసావ్!" అనుకుంది. అలా ఆలోచిస్తుంటే భద్రయ్యపై ఆమెకి జాలి కలిగింది... అభిమానం ఏర్పడింది ... అనురాగం అధికమైంది. 'నాన్నా!' అని పిలవాలనిపించింది.

దరిద్రంతో, దైన్యంగా ఉన్న భద్రయ్య కుటుంబాన్ని, తనవారిని ఆదుకోవాలనిపించింది. "తాను పెరిగిన వాతావరణం తనలో పెంచిన అహంకారం, గర్వం అధికారం అన్నీ అణుచుకుని తన డాడీని వెంట తీసుకుని కారులో కూర్చుంటూ, కారుని భద్రయ్య ఇంటికి పోనివ్వమని డ్రయివర్ని ఆజ్ఞాపించింది. డ్రయివరు ఆశ్చర్యపోతూ కారు స్టార్టు చేసాడు. కారు అందమైన రోడ్డు మలుపు తిరిగి మట్టిరోడ్డుమీద కుదుటుకుంటూ పోసాగింది. పోయి పోయి మురికివాడల్లో ఆగింది. 'ఇదే భద్రయ్య ఇల్లు.' డ్రయివరన్నాడు.

కారులోంచి అడుగు క్రిందకి వేయబోతుంటే ఏదోలా అనిపించింది వనజకి. కారు చుట్టూ కొంతమంది జనం పోగయారు. మరి కొంతమంది వాకిట్లో గొల్లుమన్నారు. మూడ్రోజుల క్రితం ఈ లోకం విడిచి వెళ్ళిపోతుందేమోనన్న భద్రయ్య భార్య, భద్రయ్య తలదగ్గర కూర్చుని లబోదిబోమంటోంది. భద్రయ్య పిల్లలూ, మనవలూ చేరి గొల్లుమన్నారు.

అదే సమయాన—

"నా కంఠంలో ప్రాణం ఉండగా ఈ దిక్కుమాలోన్డు తండ్రని వనజమ్మకు తెలనివ్వకు దేవుడా!" అన్న భద్రయ్య కోర్కెనూ "భగవాన్... భద్రయ్యను తాను 'నాన్నా' అని పిలవాలా...వీల్లేదు". అన్న వనజమ్మ కోర్కెను ఆ భగవంతుడు తీర్చేసాడు.